క్లుప్తంగా

భగవన్నామ స్మరణతో మానసిక ప్రశాంతత



ప్రత్యేక అలంకరణలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

కొమ్మాది: యాంత్రికమైన జీవితంలో భగవన్నామ స్మరణం ఒక్కటే మనశ్శాంతిని చేకూరుస్తుందని సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని అన్నారు. ఇస్కాన్ మందిరంలో వారాంతపు పూజల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రవచనాల్లో వారు అనుగ్రహ భాషణం చేశారు. హరేరామ హరేకృష్ణ, కృష్ణకృష్ణ రామరామ నామస్మరణతో మందిరం మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్టు కొమ్మలు



రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు కొమ్మలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో రోడ్డుపైకి చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. అకస్మాత్తుగా వీచిన గాలులకు ఈ కొమ్మలు రోడ్డుపై నేలకొరిగాయి. అయితే ఆ సమయంలో అటుగా ఏ వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు వెంటనే ఆ కొమ్మలను తొలగించారు.

హైందవ శంఖారావ ర్యాలీ నేడు

తగరపువలస: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి హైందవ శంఖారావ ర్యాలీ, సమ్మేళనం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. పట్టణ ప్రజలంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు 98663 55904, 99087 29298 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

ఒకరిపై కేసు నమోదు

పద్మనాభం: మండలంలోని విజయానందపురం జంక్షన్‌లో అక్రమంగా మద్యం సీసాలు కలిగిన ఒక వ్యక్తిని ఆదివారం పట్టుకుని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. వివరాలివి.. ఈ గ్రామానికి చెందిన బూర్లె అప్పలనాయుడు ఏడు మద్యం సీసాలు పట్టుకుని వెళుతుండగా విజయానందపురంలో జంక్షన్‌లో పట్టుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు.

బాందేవుపురం రోడ్డు గోతులమయం



గ్రామ ప్రవేశంలో గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం రోడ్డు పలు చోట్ల గోతులు పడింది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మద్ది రాజు–వెంకటపతి రాజు చెరువు మలుపు, బాందేవుపురం గ్రామ ప్రవేశంలో, అనేక చోట్ల రోడ్డు గోతులు పడింది. ఈ రోడ్డుపై విజయనగరం జిల్లా జామి మండలం అలమండ, కొత్తవలస, పద్మనాభం మండలం బాందేవుపురం, గంధవరం, విజయరాంపురం, కొత్త కొవ్వాడ, తిమ్మాపురం గ్రామాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లారీలు తిరుగుతూ ఉంటాయి. రోడ్డు గోతులుపడడంతో వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు.అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

60ల్లోనూ.. 20లా..

- ఉత్సాహంగా దూసుకుపోతున్న సీనియర్ సిటిజన్స్
- ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఉషోదయ వేళలో వాకింగ్, యోగా, వ్యాయామం
- 'శిల్పారామం జాతర వాకర్స్ అసోసియేషన్' సందడి



టగ్ ఆఫ్ వార్ లో ఉత్సాహంగా పాల్గొన్న సీనియర్ సిటిజన్లు



ఆటాడుదాం కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సందడి

పీఎం పాలెం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న గోల్డెన్ వర్డ్స్‌ను ఆచరణలో పెడుతూ 60 ఏళ్లు దాటినా తమలో 20ల నాటి ఉత్సాహం ఉరకలు వేస్తోందంటూ చలాకీ కబుర్లతో సాగిపోతున్నారు సీనియర్ సిటిజన్స్. శిల్పారామం జాతర వాకర్స్ పేరున అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని, దైనందిన జీవితంలో ఆహార, విహారాల్లో నియమాలు పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఓపెన్ జిమ్‌లో కసరత్తు చేసేవారు కొందరైతే వాకింగ్, జాగింగ్, తాము నేర్చుకున్న యోగాసనాలు అభ్యసిస్తూ కొందరు, షటిల్ ఆడుతూ, నృత్యాలు చేస్తూ కొందరు తమ ఆసక్తికి అనుగుణంగా జీవన సరళితో సాగిపోతున్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడు,నీడగా నిలుస్తున్నా రు. 28 ఎకరాల విస్తీర్ణంలో, పచ్చదనంతో అలరారే శిల్పారామంలో ప్రవేశం కోసం స్వల్ప ప్రవేశ రుసుము వసూలు చేయడం తమకు ఎంతో అనువుగా ఉందని చెబుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఇక్కడే గడుపుతుంటారు.



షటిల్ ఆడుతూ ..



మహిళా సీనియర్ సిటిజన్ల హుషారు

ఆదివారం వస్తే సందడే సందడి

సుమారు 300 మంది సభ్యులున్న అసోసియేషన్‌లో ప్రతి ఆదివారం సభ్యుల పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారు. ఆ వారంలో పుట్టినరోజు ఉన్న సభ్యులకు శుభాభినందనలు తెలుపుతూ, ఈ వేడుకను జరుపుకోవడం విశేషం. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వంటి జాతీయ పర్వదినాలు, జాతీయ ముఖ్య నాయకుల జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహించడం ద్వారా తమ సామాజిక స్పృహను చాటుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

రోజూ వాకింగ్ చేస్తాను



ప్రతిరోజూ వాకింగ్ చేస్తాను. వాకింగ్ వలన అనుభవపూర్వకంగా ఎన్నో ప్రయోజనాలు పొందాను. మా అసోసియేషన్ సభ్యులంతా కలసిమెలసి ఉంటాం. మానవ సంబంధాలు సన్నగిల్లుతున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి అసోసియేషన్లు వారి వారి ప్రాంతాలలో నెలకొల్పుకోవాలి. స్నేహితులతో కొన్ని గంటలైనా గడిపితే ఉత్సాహం, ప్రశాంతత లభిస్తాయి.

– వైకుంఠరావు రిటైర్డ్ డీఎస్పీ, పీఎం పాలెం

80 ఏళ్లయినా ఏ ఆరోగ్య సమస్యా లేదు



నాకు ఇప్పుడు సుమారు 80 సంవత్సరాలు. నా బైక్ నేనే నడుపుతా. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవు. రోజూ వాకింగ్ చేస్తాను. నెగిటివ్ ఆలోచనలు మనసులోకి రాకుండా జాగ్రత్త పడతాను. ఆహార విహారాలలో సమయ పాలన పాటిస్తాను. తోటి సభ్యులలో ఉత్సాహం నింపడానికి కృషి చేస్తాను.

– టి.నారాయణ స్వామి, విశ్రాంత పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగి

బండి తగలబెట్టేశారు



కాలిపోయిన ద్విచక్ర వాహనం

భీమునిపట్నం: తమ అమ్మాయిని ప్రేమిస్తున్నాడన్న కారణంతో అమ్మాయి బంధువులు ప్రేమిస్తున్న యువకుడి ద్విచక్రవాహనాన్ని ఆదివారం సాయంత్రం తగలబెట్టేశారు. వివరాలివి.. విశాఖ ప్రాంతానికి చెందిన యువతి, యువకుడు ప్రేమించుకుంటున్నారు. వీరిని అమ్మాయి తరఫువారు మందలించినా వినలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం భీమిలివైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నట్టు సమాచారం అందడంతో, ఇక్కడ బీచ్ రోడ్డులోని మార్లిన్‌కే రెస్టారెంట్ వద్ద అమ్మాయి బంధువులు వీరిని అడ్డుకున్నారు. దీంతో భయపడి యువకుడు పారిపోగా వారు కోపంతో అతని ద్విచక్రవాహన్ని తగలబెట్టి, అమ్మాయిని తీసుకుని వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని సీఐ సుధాకర్ తెలిపారు.

మోహనరావు మాస్టారుకు పురస్కారం



తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేటకు చెందిన ఉపాధ్యాయుడు గంటాన మోహనరావుకు హైదరాబాద్‌కు చెందిన ద సి కనెక్ట్స్ సంస్థ 'గ్రోత్ స్టోరీస్ సమ్మిట్' అవార్డును జీవిత సాఫల్య పురస్కారం–2024 కింద అందించింది. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈయన రచించిన 'స్పీక్ ఇంగ్లిష్ ఏజ్ ఇంగ్లిష్' 'ది బుక్ ఆఫ్ ఇంగ్లిష్ సినోనిమ్స్' పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎంతగానో దోహదపడ్డాయి. నగరంలోని దబ్బజార్ జీవీఎంసీ ఎంవీడీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మోహనరావు మాస్టారు 2009లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తాను స్థాపించిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా అయిదేళ్లుగా 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ ఇస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా చిట్టివలస పరిధిలో నిరుద్యోగులకు ఉచితంగా పోటీ పరీక్షలకు శిక్షణ, గ్రంథాలయాల నిర్వహణ చేస్తూ, ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6గంటలకు ప్రదర్శించిన శాస్త్రీయ జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. సింహాచలంకు చెందిన సరస్వతి నృత్య కళా మందిర్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు తాము అభ్యసించిన నృత్యరీతులను అద్భుతంగా ప్రదర్శించి, అలరించారు. మూషిక వాహన నృత్యాంశంతో ప్రారంభమైన కార్యక్రమంలో బ్రహ్మ కడిగిన పాదము, అదివో అల్లదివో .. ముద్దుగారే యశోదా.. తదితర అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జానపద గేయాలకు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలసరస్వతి నృత్య దర్శకత్వంలో భువన, హిరణ్య, ఊర్మి భవిష్య, వైష్ణవి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

అంబేడ్కర్‌ను అవమానపరిచిన వారిని శిక్షించాలి



వేములవలస ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న గోపాలరావు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం నుంచి పూలమాలలు తొలగించి అవమానపరచిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత నాయకులు ఎస్ఐ సంతోష్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు మాట్లాడుతూ ఈ నెల 6న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎస్సీ కాలనీలో విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొందరు దుండగులు విగ్రహం నుంచి పూలమాలలు తొలగించారన్నారు. దీనిని నిరసిస్తూ ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ అప్పారావు, సియ్యాద్రి సన్నిబాబు, బోని సన్నిబాబు, మల్లారపు కృష్ణ, ఉప్పాడ సత్యనారాయణ, మామిడి శివ, బోని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం



అసంపూర్తిగా ఉన్న పెంట పంచాయతీ భవనం



తలుపులు లేని కిటికీలు

పద్మనాభం: మండలంలోని పెంట పంచాయతీ భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో ఈ భవనం మందుబాబులకు, జూదరులకు అడ్డాగా మారింది. ఈ భవన నిర్మాణ పనులను 2015లో రూ.13 లక్షలతో ప్రారంభించారు. అయితే, భవనానికి సున్నం వేయ లేదు. ద్వార బంధా లు, కిటికీలకు తలు పులు బిగించలేదు. గచ్చులు చేయలేదు. విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. నిధులు చాలక ఈ పనులు చేపట్టలేదు. 2016 నుంచి దీని స్వరూపంలో ఏ మార్పులేదు. ద్వార బంధాలకు తలుపులు లేకపోవడంతో దుండగులు ప్రవేశించి భవనాన్ని పాడు చేస్తున్నారు. భవనంలో పేకాట ఆడుతున్నారు. మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. పశువు లను కడుతున్నారు. ఫ్లోరింగ్ సరిగ్గా లేకపోవడంతో భవనం లోపల పుట్టలు ఏర్పడుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

శిథిలావస్థలో పాత భవనం: పాత పంచాయతీ భవనం శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. పెంకులు ఊడిపోయాయి. వర్షాలకు కారిపోతోంది. దీంతో ఈ భవనంలో పంచాయతీ కార్యాలయం నిర్వహణ ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, పంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేసి శిథిల భవనం నుంచి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస పెన్షన్ పెంపునకు '17న బ్లాక్ డే'

తగరపువలస: కేంద్రప్రభుత్వం కార్మికులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని చిట్టివలస జ్యూట్ మిల్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు డిమాండ్ చేశారు. చిట్టివలసలో ఆదివారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ల పెరుగుదలకు ఉద్యమాలు తప్పేట్టు లేదన్నారు. ఇటీవల సీబీటీ సమావేశాలు జరిగినా పెన్షనర్ల సమస్యలపై కేంద్రం పట్టించుకోకుండా పక్కదారి పట్టిస్తుందన్నారు. కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచుకోవడానికి గాను ఈ నెల 17న బ్లాక్ డే నిర్వహించాలని నిర్ణయించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కానూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా దామోదర బాబాజీ, కోశాధికారిగా పంపాన సూర్యనారాయణను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా మోర అప్పలరాజు, ఉపాధ్యక్షునిగా సింగిడి అప్పారావు కార్యవర్గ సభ్యులుగా 9 మంది, సమితి సభ్యులుగా 12 మంది ఎన్నికయ్యారు.

16న మహా సన్నిధాన పూజ



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సేవా సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో స్వామివారి పీఠం వద్ద ఈ నెల 16న అయ్యప్ప స్వామి మహాసన్నిధాన పూజా మహోత్సవం నిర్వహించనున్నామని సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నర్సింగరావు తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని పీఠం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహా సన్నిధాన మహోత్సవంలో ప్రత్యేక పూజలతో పాటు, శాంతి పూజా కార్యక్రమాన్ని ప్రవీణ్‌కుమారన్ నంబూద్రి నిర్వహిస్తారని, మంగళ హారతులు శ్యామలానంద స్వామి ఇస్తారని పేర్కొన్నారు. భక్తులందరూ విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, ముఖ్య సలహాదారులు గుగ్గిళ్ల సాయి, మధు పంతులు, సభ్యులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ హరి

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం బాక్సింగ్ హాల్లో ఆదివారం జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలలో జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు క్రీడాకారులకు పతకాలు సాధించారు. బాలాజీనగర్ ఏకే–1 హరి కోచింగ్ సెంటర్‌కు చెందిన బలరామ్ స్వర్ణ పతకం, కె.చైతన్య, జి.వెంకట నరసింహులకు రజత, వి.సుమనశ్రీ, టి.విశాల్‌లకు కాంస్య పతకాలు లభించాయి. ఈ సందర్భంగా వారిని కోచ్ అర్జి హరి, బాలాజీనగర్ వాసులు అభినందించారు.

అంధకారంలో రుషికొండ జంక్షన్



వెలగని హైమాస్ట్ లైట్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పెదరుషికొండ నాలుగు రోడ్ల జంక్షన్ (ఐటీ జంక్షన్) వద్ద పది రోజులుగా హైమాస్ట్ లైట్స్ వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంతమంతా అంధకారం నెలకొంది. రాత్రి సమయాల్లో అటువైపు వెళ్లాలంటేనే ఆందోళనగా ఉంటోందని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ చీకటి వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోసేవతో జీవనం సార్థకం



హరేకృష్ణ వైకుంఠంలో నిర్మించిన శ్రీవారి గోశాల



గోవుకు మేత అందిస్తున్న నిష్కించిన భక్తదాస

తగరపువలస: భారతదేశంలో జన్మించిన వారు గోవులకు, బ్రాహ్మణులకు, విష్ణుభక్తులకు భక్తితో సేవ చేసుకోవడం ద్వారా జీవితాన్ని సార్థకం చేసుకోవాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవి రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో శ్రీవారి గోశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా యదురాజా దాస తన బోధనలలో గోవుల ప్రాధాన్యత గురించి వివరించారు. మానవ శరీరాన్ని పరిపూర్ణంగా అభివృద్ధి చేయడానికి గోవు అత్యంత ముఖ్యమైనదన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు తన బోధనలలో ఆవు ప్రాముఖ్యత గురించి వివరించేవారన్నారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ మానవ సమాజానికి వాటి పవిత్ర స్వభావానికి వేద సంస్కృతిలో గోవులు ముఖ్యమైనవిగా పరిగణించబడ్డాయన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ హరేకృష్ణ ఉద్యమ సంకీర్తన మేళా నిర్వహించారు.

శ్రీవిద్యా శక్తి పీఠంలో విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన నవనాగులు, వారాహి అమ్మవారు, మానసాదేవి, రాహుకేతులు, కాలభైరవ విగ్రహాలు



ప్రతిష్ఠించిన వినాయకుడు, స్ఫటిక శివలింగం, దుర్గాదేవి విగ్రహాలు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలోని శ్రీవిద్యాశక్తిపీఠంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణచక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో 17 విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయకుడు, దుర్గాదేవి, స్ఫటిక శివలింగం, వారాహి అమ్మవారు, రాహువు, కేతువులు, మానసాదేవి, కాలభైరవుడితో పాటు తొమ్మిది నాగదేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమం అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ఆవరణలో భారీగా అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా నగరానికి చెందిన ఇందుపూరి నాగరాజు, పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి దంపతులను సువర్ణ సింహ తలాటం (సువర్ణ కంకణం)తో సన్మానించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని రాహుకేతువులు, వారణాసి, కాకినాడలోని వారాహి అమ్మవారి దగ్గరకు వెళ్లలేని వారికి అందుబాటులో ఈ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు చెప్పారు. అమూల్యమైన స్ఫటిక లింగాన్ని కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశామన్నారు.

స్నిగ్ధ శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం



అనాథాశ్రమ పిల్లలకు నిత్యావసర సరకులు, దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ద్వారా ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఫౌండేషన్ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో తన భార్య, కుమార్తెను కోల్పోయినా కుంగిపోకుండా, వారి పేరిట నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమ పిల్లలకు నిత్యావసర సరకులు, దుస్తులు అందించారు. పేద పిల్లలకు పుస్తకాలు, పేద మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఫౌండేషన్ సభ్యులు కలిగొట్ల మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో సందర్శకుల సందడి



కొమ్మాది: భీమిలి సమీపంలోని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, తొట్లకొండ, బావి కొండ, రామానాయుడు ఫిలిం స్టూడియో, రుషికొండబీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాలు జనంతో రద్దీగా మారాయి. వారంతా కుటుంబాలతో వచ్చి, ఆటపాటలతో సరదాగా గడిపారు.